క్లుప్తంగా

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

తహసీల్దార్ జయరాం



ప్రజావాణి నిర్వహించిన తహసీల్దార్

సంగారెడ్డి టౌన్: ప్రజాసమస్యలు పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి మండల తహసీల్దార్ జయరాం అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యలను తొందరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

సంగారెడ్డి టౌన్: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీపీఎం రమేశ్‌బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని మహిళా శిశు వికాస కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని సంఘం సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధికారులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై బస్తీబాట



ప్రజలతో మాట్లాడుతున్న మహిపాల్ తదితరులు

జహీరాబాద్ టౌన్: ప్రజా సమస్యలను తెలుసుకొనేందుకు సీపీఎం నాయకులు సోమవారం బస్తీబాట పట్టారు. జహీరాబాద్ డివిజన్ నాయకులు మహిపాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని రహ్మత్‌నగర్, సిద్దేశ్వర కాలనీ, డబుల్‌బెడ్ రూం కాలనీలో పర్యటించారు. మురికి కాలువలు, సీసీ రోడ్లు తదతర సమస్యలపై ప్రజలు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సలీమోద్దీన్, బాలరాజ్, నరేష్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

సంగారెడ్డి టౌన్: చెరుకు పంటకు ఖర్చులు పెరిగి విస్తీర్ణం తగ్గుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం చెరుకు టన్నుకు 500 బోనస్ ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు గణపతి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు టన్నుకు 5000 చెల్లించాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం మండలాల్లో ప్రత్యేక అధికారులను నియమించాలని కోరారు.

వంటగదుల్లో పరిశుభ్రత పాటించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

కంగ్టి(నారాయణఖేడ్): పాఠశాలల వంటగదుల్లో పరిశుభ్రత పాటించాలని కంగ్టి ఎంఈఓ ఎండీ రహీమొద్దీన్ పేర్కొన్నారు. సోమవారం కంగ్టిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఎంఈఓ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు పంపిణీ చేసిన బ్లాంకెట్లు, పాఠశాల రికార్డులు పరిశీలించారు. అనంతరం తాగునీటి ప్లాంట్ , వంటగదిలో పరిశుభ్రత, పాత్రలు పరిశీలించారు. బాలికలకు విద్యాబోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.కార్యక్రమంలో ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, సీఆర్‌పీ సిబ్బంది ఉన్నారు.

నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ డివిజన్ సీపీఐ కార్యదర్శిగా కె.నర్సింలను నియమించారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సీపీఎం సభలో ఆయనను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. నర్సింలు జహీరాబాద్ డివిజన్ కార్యదర్శిగా ఎన్నిక కావడం ఇది నాలుగవసారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పార్టీ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు.

ఏర్పాటు చేశారు.. ప్రారంభం మరిచారు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని ప్రజల, కార్మికుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. పారిశ్రామికవాడలోని సర్వేనం.10లో పరిశ్రమ సాకారంతో రెండేళ్ల క్రితం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అందుబాటులోకి తీసుకురావడం మరిచారు. పరిశ్రమల్లో విధులు నిర్వహించే కార్మికులు అక్కడే నివాసం ఉంటున్నారు. కార్మికులకు తాగు నీటి సమస్య ఉంది. గడ్డపోతారం గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మున్సిపాలిటీగా మారి ఏడాది కావస్తున్నా దుమ్ము ధూళి పడి నిరుపయోగంగా ఉండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను



నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. అందుబాటులోకి తీసుకువస్తే కార్మికులకు తాగునీరు నిరంతరం అందుతుందన్నారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

సంగారెడ్డి: వైద్య శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖ అధికారులతో నులిపురుగులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాలు గల పిల్లలకు నూలి పురుగుల మాత్రలు తప్పనిసరిగా అందించాలన్నారు. ఏ ఒక్కరు అశ్రద్ధ చేయకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

వైద్యాధికారి నాగనిర్మల, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య నిర్మాతలు కామర్స్ విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: దేశ వాణిజ్య భవిష్యత్ నిర్మాతలు కామర్స్ విద్యార్థులని ప్రభుత్వ విశ్రాంత కామర్స్ అధ్యాపకులు ఎం.అశోక్ అన్నారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో సోమవారం కామర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్ మాట్లాడుతూ.. విస్తరించిన గ్లోబలైజేషన్‌లో కామర్స్ విద్యార్థులు వేల కొత్త ఉత్పత్తులతో మార్కెటింగ్ స్థాయిని పెంచుతున్నారని కొనియాడారు. ప్రపంచంలోని ఏ మూలలో ఉన్న వస్తువులను అన్ని ప్రాంతాలకు అందేలా కామర్స్ విద్యార్థుల కృషి ఉందన్నారు. కామర్స్ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి అభినందించారు. విద్యార్థులకు ప్రశం



మాట్లాడుతున్న విశ్రాంత అధ్యాపకులు అశోక్

సా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చింతల హరికుమార్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు నిఖిత, రాంప్రసాద్, దత్తు, దీపిక, నవీన, సల్మా, ఒనిసాలు పాల్గొన్నారు.

సర్వేయర్లకు శిక్షణ



సర్వేయర్లకు శిక్షణ కల్పిస్తున్న కోటేశ్వరరావు

కంది(సంగారెడ్డి): కందిలో నూతనంగా ఎంపికైన సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఈ శిక్షణ 40 రోజుల పాటు కల్పించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. శిక్షణలో భాగంగా భూభారతి చట్టప్రకారం భూముల సర్వే, విధి విధానాలపై వారికి వివరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ సర్వేయర్ కోటేశ్వర రావుతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో సోమవారం కార్పొరేటర్ పుష్ప పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని థీమ్‌పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. కాలనీలో పారిశుద్ధ్యం, భూగర్భడ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కాలనీవాసులు తన దృష్టికి తీసుకోవచ్చిన సమస్యలను త్వరలో పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్య



రోడ్డుపై చెత్తను చూపిస్తున్న కాలనీవాసులు

క్షుడు అమృతసాగర్ కాలనీవాసులు నరేందర్‌బాబు, ప్రభాకర్‌రెడ్డి, మునీందర్, శ్రీధర్, అంజాద్‌ఖాన్, ఉమాశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, కళాశాలను మండల ఫుడ్ కమిటీ అధికారులు సోమవారం సందర్శించారు.తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, ఎంఈఓ మాణెయ్య, హెచ్‌ఎంలు ఖైరత్‌అలీ, శ్రీనివాస్‌లు పాఠశాల ప్రత్యేకాధికారితో మాట్లాడి విద్యార్థుల అందిస్తున్న సదుపాయాలు తెలుసుకున్నారు. భోజనం, అల్పాహారం ఏవారం ఏమేమి వడ్డిస్తురనే వివరాలను నమోదు చేసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడి మెనూ పాటింపు, భోజనం రుచిపై అభిప్రాయాలను సేకరించారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించి విద్యార్థినుల ఆరోగ్య భద్రతపై



విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిటీ అధికారులు

ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల, కళాశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.

7న స్పాట్ అడ్మిషన్లు

జోగిపేట(అందోల్): జోగిపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మహిళలకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అందోల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లో 5, 6 తేదీలలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 7వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు విద్యార్థులు దరఖాస్తులో పేర్కొన్న ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలని అన్నారు. సెలెక్ట్ అయిన వారికి అదే రోజున అడ్మిషన్లు ఇస్తారన్నారు. ఏ కోర్సులో ఎన్ని సీట్లు ఉన్నాయో ప్రకటిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: రంజోల్ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 5 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సువర్ణలత సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఆటోమొబైల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఖాళీలకు స్పాట్ అడ్మిషన్‌లు ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. మొదటి రెండు రౌండ్ల లో సీట్లు పొందని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ లో పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 5 నుంచి 7 వరకు దరఖాస్తుల స్వీకరణ 7న సాయంత్రం మెరిట్ ఆధారంగా స్పాట్ అడ్మిషన్‌లు కల్పిస్తామన్నారు.

డిప్లొమాలో స్పాట్ అడ్మిషన్లు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమాకు సంబంధించిన ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సీఎం సహాయనిధితో కార్పొరేట్ వైద్యం

పటాన్‌చెరు: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కుమ్మరి బస్వరాజు గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ. రెండు లక్షల 50 వేల ఎల్‌ఓసీని సోమవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, వెంకట్ రెడ్డి, దశరథ్‌రెడ్డి, పాండు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి మొక్కలు నాటాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద మొక్కలను నాటాలని జెడ్పీహెచ్‌ఎస్ సచ్చినాందరెడ్డి అన్నారు. జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి ఆవరణ, పొలం గట్లు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటాలని విద్యార్థులకు సూచించారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధి అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ దేవాలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో అనేక ప్రార్థన మందిరాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. అలాగే జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా, బీఆర్‌ఎస్



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని జూకల్ శివారులో నిర్మించిన 795 ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలన్నారు. కోట్ల రూపాయలు ప్రజాధనం పెట్టి కట్టిన ఇళ్లు పాడవుతుంటే అధికారులు పట్టించుకోరా అని



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశ్నించారు? ప్రభుత్వం వాటిని రిపేర్ చేసి అర్హులకు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో ప్రజలందరినీ ఐక్యం చేసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గసభ్యులు మాణిక్యం, నర్సింలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాతవారికే డబుల్ ఇళ్లు కేటాయించాలి

నారాయణఖేడ్: మండల పరిధి జూకల్ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్లను లాటరీ ద్వారా అర్హులను ఎంపిక చేసిన వారికే కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇతరులకు కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సోమవారం అప్పట్లో ఎంపిక చేసిన బాధితులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ఎమ్మెల్యే అప్పటి లబ్ధిదారులను కాదని అనర్హులైన కాంగ్రెస్ కార్యకర్తలకు కేటాయించేందుకు యత్నిస్తున్నారన్నారు. గతంలో కేటాయించినవారిని కాదని ఇతరులకు ఇళ్లను కేటాయిస్తే హైకోర్టు, సుప్రీం కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. అనంతరం బాధితులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, ముజమ్మిల్ మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పరమేశ్వర్, పట్టణ అధ్యక్షుడు నగేష్, సంగప్ప, మల్గొండ పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్న భూపాల్‌రెడ్డి

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత

న్యాల్‌కల్(జహీరాబాద్): తల్లిపాలలో అనేక పోషకాలు ఉంటాయని బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతాయని జహీరాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత అన్నారు. న్యాల్‌కల్‌లో సోమవారం తల్లి పాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అనిత మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు ఆరునెలలు నిండే వరకు తల్లిపాలను తప్పకుండా పట్టించాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు ఇంటింటికి తిరిగి తల్లిపాల ప్రాముఖ్యను వివరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, అంజమ్మ, జగదీశ్వరీ పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం

జహీరాబాద్ టౌన్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదపడుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సద్గుణ అన్నారు. మండల కేంద్రం మొగుడంపల్లిలో సోమవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిశువు పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి చీరలు, పండ్లు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు స్వరూప, ప్రవీణ, అంగన్‌వాడీ టీచర్ తుల్జమ్మ, ఆశావర్కర్లు యశోద, ప్రకృత పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

స్వాతంత్ర్య వేడుకలు విజయవంతం చేయాలి

డీఆర్‌ఓ పద్మజారాణి

సంగారెడ్డి జోన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని డీఆర్‌ఓ పద్మజారాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పతాక ఆవిష్కరణ, గౌరవ వందనం, సాంస్కృతిక కార్యక్రమాలు, మెడికల్ టీమ్, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, బహిరంగ మైదాన ఏర్పాట్లు తదితర అంశాలపై ఆమె సమీక్ష చేశారు.

తల్లిపాలతో శిశువు ఎదుగుదల

తల్లిపాలు తాగడం వల్ల శిశువుల ఎదుగుదల బాగుంటుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని డీఆర్‌ఓ పద్మజారాణి, జిల్లా శిశు సంక్షేమాధికారి లలితకుమారి అన్నారు. కలెక్టరేట్‌లో వారోత్సవాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆగస్టు 1 నుంచి 7వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు.

కాలనీవాసుల ఆందోళన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో జరుగుతున్న పైపులైన్ పనులను నిలిపివేయాలని సోమవారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కాలనీకు ఈ పైపులైన్లు అవసరం లేదన్నారు. గతంలో వర్షం నీరు వెళ్లే కాలువను వదిలి లక్షలాది రూపాయలతో నూతన పైప్‌లైన్ వేయడం ఎంటని ప్రశ్నించారు. ఈ విషయంపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. సదరు కాంట్రాక్టర్ మాట్లాడుతూ.. 15 రోజులుగా పనులు నడుస్తున్నాయన్నారు. టెండర్ ద్వారా ఈ పనులను చేస్తున్నామని వివరించారు.



మాట్లాడుతున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్

భూబాధితులకు న్యాయం చేయండి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని సర్వేనం.1, జంగంపేట 376 భూబాధితుల సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం హెచ్‌ఎండీఏ పేరిట 180 ఎకరాల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంది. పరిహారం కింద ఎకరాకు 600 వందల గజాల చొప్పున స్థలం కేటాయిస్తూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆర్డీఓ సమక్షంలో ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. కానీ ఇప్పటివరకు పొజిషన్ చూపించలేదని అధికారులతో ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులు అటు భూములు కోల్పోయి, ఇటు పరిహారం అందక రోడ్డున పడే పరిస్థితి నెలకొందని వాపోయారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, నిఖిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపతహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

సంక్షిప్త వార్తలు

◆ **13న డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ**

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలో హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఈ నెల 13న లబ్ధిదారులకు అప్పగిస్తామని తహసీల్దార్ దశరథ్ తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో హోతి(కె) వద్ద రూ.36 కోట్లతో 660 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించింది. రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇళ్లను అప్పగించకపోవడంతో లబ్ధిదారులకు సీపీఎం నాయకులు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగినున్నారు.

◆ **ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి**

వట్‌పల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ అంజయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శిలు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా ఉపాధి కూలీలకు సంబంధించి ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. ఇంకుడు గుంత, మరుగుదొడ్డి లేని ఇల్లు ఉండకుండా నిర్మించుకునేలా చూడాలన్నారు. వార్డుల వారీగా ఓటరు జాబితాను తయా రు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

◆ **పుల్‌కల్ ఐకేపీ ఏపీఎంగా చంద్రశేఖర్**

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ మండల ఐకేపీ ఏపీఎంగా జీ చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన శివలక్ష్మి కంది మండలానికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కొత్తగా మహిళా గ్రూపులు పెంచి రుణాలు పెంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

◆ **వట్‌పల్లి ఏపీఎంగా చంద్రశేఖర్**

వట్‌పల్లి(అందోల్): మండల మహిళా సమాఖ్య డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పి.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. కల్హేర్ మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎంగా పని చేసి ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను డ్వాక్రా మహిళలకు వివరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు ఈశ్వరయ్య, జనార్దన్ , మల్లీశ్వరీ, వీఓఏలు నరేందర్, సంజీవులు, జాని, రాజు, అకౌంటెంట్ మమత పాల్గొన్నారు.

◆ **స్థానిక ఎన్నికల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి**

సంగారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించేలా నామినేటెడ్ సభ్యులుగా పరిగణించాలని మంత్రులకు వికలాంగుల సంఘం సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల ప్రాతినిధ్య సాధన సమితి ప్రతినిధి బృందం చైర్మన్ షఫీ హమ్మద్ ఆధ్వర్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరికి విన్నవించారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం వైస్ చైర్మన్ మైనంపల్లి మల్లికార్జున్, సలహాదారుడు తుడుం రాజేందర్, శబరి చావ్లా, పోచయ్య, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

◆ **తైబజార్ వసూలు చేయాలి**

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ పరిధిలో తైబజార్ వసూలుకు బయట వ్యక్తులకు టెండర్ ఇవ్వద్దని మున్సిపల్ సిబ్బంది ద్వారానే వసూలు చేయించాలని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైబజార్ వసూలుకు టెండర్ పక్రియ ద్వారా వసూలు చేయాలని మున్సిపల్ యంత్రాంగం ప్రయత్నిస్తుందన్నారు. బయట వ్యక్తుల ద్వారా వసూలు జరిగితే వ్యాపారులు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వాపోయారు.

◆ **హత్నూర ఏపీఎంగా రాజశేఖర్**

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండల ఐకేపీ ఏపీఎంగా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏపీఎం దేవేందర్ అందోల్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర మాట్లాడుతూ.. మండలంలోని మహిళా సంఘాల బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు.